సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

ఎట్టకేలకు మోక్షం

- తీరిన రెండు దశాబ్దాల విద్యుత్ సమస్య
- లక్ష్మీనారాయణపురం-1లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు
- 'జగనన్నకు చెబుదాం' ద్వారా తక్షణ పరిష్కారం
- ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపిన నివాసులు


లక్ష్మీనారాయణపురం-1కు విద్యుత్ సరఫరా చేసే లైన్ల వద్ద మరమ్మతులు చేస్తున్న సిబ్బంది


నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు లక్ష్మీనారాయణపురం-1లో దాదాపు ఇరవై ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న విద్యుత్ సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఇటీవల జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికింది. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
కైలాసపురం-తాటిచెట్లపాలెం రోడ్డులోని లక్ష్మీనారాయణపురం-1లో కొన్ని వందల గృహాలు, వేల మంది ప్రజలు నివసిస్తున్నారు. ఈ ప్రాంతానికి ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లోడ్ సరిపోనందువల్ల సుమారు 20 ఏళ్ల నుంచి ఇక్కడ విద్యుత్ సమస్య ఉంది. దీని కారణంగా ప్రతి రోజు కొన్ని గంటల పాటు విద్యుత్ లేకుండా గడిపిన సందర్భాలను స్థానికులు ఎదుర్కొనేవారు. ముఖ్యంగా వేసవిలో అయితే కొన్నిసార్లు రాత్రంతా కరెంట్ లేకుండానే గడిపేవారు. ఈ సమస్య గురించి గత ప్రభుత్వాల హయాంలో ఎందరికి తెలియజేసినా పరిష్కారం దొరకలేదని నివాసులు వాపోతున్నారు.

వెంటవెంటనే మరమ్మతులు

ఈ క్రమంలో ఈ నెల 3వ తేదీ శనివారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫోన్ ద్వారా ఓ స్థానికుడు తమ కాలనీ విద్యుత్ సమస్యపై ఫిర్యాదు చేశాడు. దీనిపై వెంటనే స్పందించిన విద్యుత్ శాఖ సిబ్బంది అదే రోజు సాయంత్రం హుటాహుటిన లక్ష్మీనారాయణపురానికి చేరుకుని.. ఆదివారం రాత్రి వరకు పాత ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా విద్యుత్ శాఖ సిబ్బంది పాత తక్కువ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌కు అదనంగా మరో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఈ పనులు బుధవారం రాత్రి వరకు కొనసాగాయి. పనులన్నీ పూర్తి కావడంతో ఇక తమ ప్రాంతానికి విద్యుత్ సమస్య తీరినట్లేనని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు.

జగనన్నకు చెప్పాం..
తక్షణం పరిష్కరించారు



మా కాలనీలో గత వారం వరకు విద్యుత్ సమస్య ఉండేది. ప్రతి రోజు ఏదో సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ ట్రిప్ అయి కొన్ని గంటల పాటు కరెంట్ పోయేది. దాదాపు 20 ఏళ్లుగా ఈ పరిస్థితిని మేం ఎదుర్కొన్నాం. ఈ సమస్యపై జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదు చేయగా.. వెంటనే స్పందించిన అధికారులు శాశ్వత పరిష్కారం చూపారు. సీఎం వైఎస్ జగన్‌కు మా కాలనీవాసులందరి తరఫున కృతజ్ఞతలు.
– జల్లూరి బాబూరావు, లక్ష్మీనారాయణపురం-1

కరెంటు కష్టాలు తీరాయి



ఎన్నో ఏళ్లుగా విద్యుత్ సమస్యలను ఎదుర్కొంటున్నాం. ఇటీవల మా ప్రాంతంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వేశారని తెలిసింది. దీంతో మా కరెంటు కష్టాలు తీరనున్నాయి. సమస్య పరిష్కారానికి స్పందించిన అధికారులకు, ముఖ్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాం.
– ఎస్.పూర్ణ, స్థానికురాలు

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా

లక్ష్మీనారాయణపురం-1లో కొన్నేళ్లుగా కనెక్షన్‌లు పెరిగాయి. దానికి తగ్గట్టుగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పెరగలేదని తెలిసింది. ఓవర్ లోడ్ కారణంగా విద్యుత్ సమస్యలు తలెత్తాయి. ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి ప్రజలకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని తెలియజేస్తున్నారు. ఈమేరకు అవసరమైన వనరులు అందించడం వల్ల ఏఈఈ గోపినాథ్ పర్యవేక్షణలో పనులు పూర్తి చేశాం. సమస్య పరిష్కారానికి స్థానికులు ఎంతో సహకరించారు.
– విద్యాసాగర్, డీఈఈ, అక్కయ్యపాలెం సెక్షన్

క్లుప్తంగా

'గ్రీవెన్స్'తో సమస్యల పరిష్కారం


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కె.కె.రాజు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు వార్డులకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని ఆయనకు వినతిపత్రాలు సమర్పించారు. కె.కె.రాజు వాటిని స్వీకరించి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మిగిలిన అర్జీలను సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

గురుపౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు


ఉత్సవ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రామాలయ కమిటీ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో కొలువైన షిర్డీసాయి ధ్యాన మందిరంలో గురుపౌర్ణమి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు రామాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు జూలై 3న నిర్వహించే ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు టి.నారాయణ రెడ్డి, సనపల వరప్రసాద్ ఆవిష్కరించారు. ఇందుకు సంబంధించి సాయి నామజపంతో ఏకాహం పూర్తి చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకుడు అయలూరి రామశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

కథల పుస్తకాల పేర్లపై పోటీలు


టై అండ్ డై గేమ్‌లో పాల్గొన్న విద్యార్థులు

మురళీనగర్: మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖ గ్రంథాలయం నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంద. ఇందులో భాగంగా గురువారం విద్యార్థులకు కథల పుస్తకాల పేర్లపై పోటీలు నిర్వహించారు. ఎక్కువ పేర్లు రాసిన వారిని విజేతలుగా ప్రకటించారు. వనిత వాకర్స్ క్లబ్ సభ్యురాలు జి.శిరీషలత రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. టై అండ్ డై అనే నూతన గేమ్‌ను విద్యార్థులకు నేర్పించారు. పిల్లలకు చాక్లెట్లు, బిస్కెట్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. లైబ్రేరియన్ వై.పద్మజ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

రోడ్డును ఆక్రమించి పనులు


బాలయ్యశాస్త్రి లేఅవుట్ రోడ్డులో జరుగుతున్న భవన నిర్మాణ పనులు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని స్టేట్ బ్యాంక్ పక్కనున్న రహదారి మధ్యలో భవన నిర్మాణ సామగ్రి వేసి పనులు చేపడుతున్నారు. రోడ్డుకు అడ్డంగా ఇసుక, పిక్క, కాంక్రీట్ మిషన్ ఉండటంతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు. ఆ మార్గంలో రాకపోకలు కష్టతరంగా మారాయని వారు చెబుతున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి రోడ్డును ఆక్రమించి ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా పనులు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

దాడి చేసిన వైద్యుల సస్పెన్షన్‌కు డిమాండ్


మాట్లాడుతున్న బూసి వెంకటరావు

సీతంపేట: రైల్వే డాక్టర్ విజయ్‌కుమార్ ఇంటిపై దాడి చేసిన డాక్టర్లు కాశీపతి, మహేష్‌కుమార్, లక్ష్మణరావులను తక్షణం సస్పెండ్ చేయాలని విశాఖ దళిత సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. దోషులకు వత్తాసు పలికి బాధిత ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులను అక్రమంగా బదిలీ చేసిన డీఆర్‌ఎం అనూప్‌కుమార్‌పై చైర్మన్ ఆఫ్ రైల్వే బోర్డు విచారణ చేపట్టాలన్నారు. రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో గురువారం జరిగిన దళిత సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాల్తేర్ డివిజనల్ ఆస్పత్రిలో దళిత వైద్యులు, దళిత నర్సులపై ఆధిపత్య కుల సీనియర్ వైద్యుల లైంగిక వేధింపులపై నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని, బాధిత ఎస్సీ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. డాక్టర్ కాశీపతి తన కింద పనిచేసే ఇద్దరు ఎస్సీ నర్సులతో అసభ్యంగా ప్రవర్తించినందుకు పోలీసులు ఐపీసీ 354, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్లతో మరో కేసు నమోదు చేశారన్నారు. మహేష్ కూడా తన కింద పనిచేసే మహిళలను బెదిరించి శారీరకంగా ఇబ్బంది పెట్టారన్న ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. తక్షణమే రైల్వే బోర్డు స్పందించి డీఆర్‌ఎంపై సీఆర్‌బీ విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఆలిండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే అసోసియేషన్ నాయకులు మోహన్‌రావు, ఏఐడీఆర్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాటూరి శ్రీనివాసరావు, భీమ్ సేన చిన్నారావు, స్టీల్‌ప్లాంట్, పోర్టు యూనియన్ నాయకులు వేమన, సోడదాసి సుధాకర్, కొల్లాబత్తుల వెంగళరావు, సంపూర్ణం, హరిబాబు, రాజేంద్రప్రసాద్, దుర్గారావు, వివిధ దళిత సంఘాల నాయకులు ప్లకార్డులతో నిరసన తెలిపారు.

'నవరత్నాలు'తో అందరికీ మేలు


అధికారులకు ఫోన్‌లో సమస్యలు తెలియజేస్తున్న కె.కె.రాజు

కంచరపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతోందని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 48వ వార్డు జవహర్‌లాల్ నగర్, అల్లూరి సీతారామరాజు కాలనీ, ఇందిరానగర్-5 ప్రాంతాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ ఆయన వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి కరపత్రాలు అందజేశారు. నివాసుల సమస్యలు అడిగి తెలుసుకుని, వాటిని ఫోన్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ పాఠశాలలకు వెళ్లే పిల్లల నుంచి 60 ఏళ్లు దాటిన వృద్ధుల వరకు జగనన్న అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. ప్రజాసేవే పరమావధిగా కష్టపడి పనిచేస్తున్న ఆయనకు ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి నీలి రవి, సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి, యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, డైరెక్టర్ రాయుడు శ్రీను, వార్డు నాయకులు భరత్, శ్రీరామ్, కర్రి అప్పారావు, సురేష్, రాము, ఎర్ర శ్రీను, కండిపిల్లి శ్రీను, కిషోర్, జీవీఎంసీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై పరిశోధనలకు హెచ్‌ఎంఎస్ సహకారం

నెఫ్రాలజిస్ట్, వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ రిటైర్డ్ వీసీ డాక్టర్ రవిరాజ్


అమెరికాలో హెచ్‌ఎంఎస్ వైద్యులతో డాక్టర్ రవిరాజ్

మహారాణిపేట: శ్రీకాకుళం జిల్లా ఉద్దానం కిడ్నీ వ్యాధులపై చేస్తున్న పరిశోధనలకు అమెరికాలోని హార్వర్డ్ మెడికల్ స్కూల్(హెచ్‌ఎంఎస్) సాంకేతిక సహకారం అందించేందుకు ముందుకు వచ్చిందని ప్రముఖ నెఫ్రాలజిస్ట్, వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ విశ్రాంత ఉప కులపతి, విశ్రాంత డీఎంఈ డాక్టర్ టి.రవిరాజ్ తెలిపారు. అమెరికా పర్యటనలో ఉన్న డాక్టర్ రవిరాజ్ హార్వర్డ్ మెడికల్ స్కూలును సందర్శించారు. అక్కడి నెఫ్రాలజీ విభాగం ఆహ్వానం మేరకు అమెరికా వెళ్లిన ఆయన ఉద్దానం కిడ్నీ వ్యాధులపై పరిశోధనలు చేశారు. తన పరిశోధనకు సహకారం అందించాలని కోరారు. దీనికి హెచ్‌ఎంఎస్ నెఫ్రాలజీ విభాగం నుంచి సానుకూల సంకేతాలు అందాయి. ప్రభుత్వం అనుమతి ఇస్తే పలాసలో కొత్తగా నిర్మిస్తున్న కిడ్నీ ఆస్పత్రి, పరిశోధన కేంద్రంలో వారి సహకారం ఉపయోగించుకోవచ్చని డాక్టర్ రవిరాజ్ తెలిపారు. 1995 నుంచి 2000 మధ్యలో ఉద్దానం నుంచి కేజీహెచ్‌కు ఎక్కువ కిడ్నీ బాధితులు వచ్చే వారని ఆయన తెలిపారు. దీంతో ఉద్దానం వెళ్లి వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. తమ పరిశోధనలో అక్కడి ప్రజల్లో 18.5 శాతం మంది కిడ్నీ బాధితులు ఉన్నారని గుర్తించామన్నారు. సాధారణంగా షుగర్, బీపీ వంటి వ్యాధుల వల్ల కిడ్నీ సమస్యలు వస్తాయని, ఉద్దానంలో అలాంటి సమస్యల వల్ల రాలేదన్నారు. నీరు, ఆహారం, మెటల్స్, భూమిని పరీక్షించామని, ఆయా పరీక్షల్లో కిడ్నీ జబ్బులు రావడానికి గల కారణాలు తెలియలేదన్నారు. ఈ నేపథ్యంలో హెచ్‌ఎంఎస్ సహకారంతో చేసే పరీక్షలతో పాటు జన్యు పరిశోధనలు కీలకం కానున్నాయన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ బులెటిన్‌లో ఉద్దానం కిడ్నీ వ్యాధులపై తాము చేసిన పరిశోధన పత్రం ప్రచురితమైందని తెలిపారు.

10, 11 తేదీల్లో జాతీయ స్థాయి సదస్సు

దాబాగార్డెన్స్: శివానంద సుపథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశాఖలో భారతీయతలో-అమృతకాలం అనే అంశంపై ఈ నెల 10, 11 తేదీల్లో జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నట్టు ప్రోగ్రామ్ కన్వీనర్ ఎస్.రాధాకుమారి తెలిపారు. ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్ డాక్టర్ వైవీఎస్ మూర్తి ఆడిటోరియం వేదికగా జరగనున్న సదస్సుకు వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు, ఆచార్యులు పాల్గొని జ్యోతిష్యం, ఆరాధ్య వ్యవస్థ, ఆలయ వ్యవస్థ, రక్షణ వ్యవస్థ, శిక్షణ వ్యవస్థ, ఆధ్యాత్మికత-భారతీయత, ఆర్త వ్యవస్థ ఇలా అనేక అంశాలపై ప్రసంగిస్తారన్నారు. విశాఖలో తొలిసారిగా మానవాళి మనుగడకు వివిధ అంశాలపై నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సదస్సుకు నగర వాసులు హాజరు కావాలని కోరారు.



పబ్లిక్ డిమాండ్

రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా దిమ్మ


నక్కవానిపాలెం రోడ్డు మధ్యలో దిమ్మ

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం నుంచి సత్యం జంక్షన్‌కు వెళ్లే మార్గంలో పెద్ద దిమ్మ ఉండటంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి వేళల్లో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలి.
– దుర్గాప్రసాద్, నక్కవానిపాలెం


నోడల్ ఏజెన్సీ ఏర్పాటుకు దరఖాస్తులు

ఏయూక్యాంపస్: విభిన్న ప్రతిభావంతులకు ఉపయుక్తంగా పునరావాస కేంద్రం ఏర్పాటుకు అవసరమైన నోడల్ ఏజెన్సీ స్థాపనకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా భారత ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ సూచనలతో విభిన్న ప్రతిభావంతులకు వివిధ రకాల సేవలు అందించే విధంగా ఈ కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దివ్యాంగుల కోసం పనిచేస్తున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ప్రభుత్వ, ప్రభుత్వయేతర స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలు ఈ నెల 17వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు అందించాలని సూచించారు. వివరాలకు www.socialjustice.gov.in వెబ్‌సైట్‌లో గాని పెదవాల్తేరులోని రాణి చంద్రమణి దేవి ఆసుపత్రి ఆవరణలో ఉన్న సహాయ సంచాలకుల కార్యాలయంలో గాని, 0891-2952585 ఫోన్ నంబర్‌లో గాని సంప్రదించవచ్చన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలో 11 కేవీ నార్త్ ఎక్స్‌టెన్షన్ లేఅవుట్, 11 కేవీ టీపీటీ కాలనీ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని జోన్-1 ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎస్‌ఆర్‌ఐ హాస్పిటల్ వెనుక వైపు ప్రాంతం, హెచ్‌డీఎఫ్‌సీ రీజనల్ బ్యాంకు, టీపీటీ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం


వివిధ శాఖల అధికారులతో కమిషన్ సభ్యుడు సీతారాం

మహారాణిపేట: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ సహకరించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం కోరారు. కమిషన్ ఆదేశాల మేరకు వారం రోజులుగా వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్ నిర్వహిస్తున్న చైల్డ్ లేబర్ డ్రైవ్‌ను గురువారం కలెక్టరేట్ ఆవరణలో ఆయన పరిశీలించారు. ప్రత్యేక బస్‌లో వివిధ ప్రాంతాలకు వెళ్లనున్న ఆయా శాఖల అధికారులను ఇప్పటి వరకు నమోదైన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ బాలల బంగారు భవితకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి చక్కని విద్యా, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాయన్నారు. ఇటువంటి తరుణంలో బాలలను కార్మికులుగా మార్చి వారి జీవితాలను అగమ్యగోచరం కానీయొద్దని విజ్ఞప్తి చేశారు. పీటీవీ లోవకుమార్, సీహెచ్ శ్రీనివాస్, ఎస్.శిరీష, ఎ.ఆనంద్, లక్ష్మి, ప్రమీల, 1098 చైల్డ్‌లైన్ ప్రతినిధి మీనాకుమారి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పి.భాస్కరరావు, జ్యోతి, శ్రీదేవి, కె.ఎల్లయ్య, పి.శేఖర్ పాల్గొన్నారు.

గుర్తింపు తెచ్చేలా నగరాభివృద్ధి


14వ వార్డులో శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

- మేయర్ గొలగాని హరివెంకటకుమారి
- రూ.2.53 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సీతమ్మధార: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో ప్రపంచ పటంలో గుర్తింపు తెచ్చేలా విశాఖ నగరాన్ని అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. 14వ వార్డు నార్త్ ఎక్స్‌టెన్షన్ షిర్డీసాయిబాబా దేవాలయ రోడ్డులో రూ.2,53,46,000తో చేపట్టే అభివృద్ధి పనులకు గురువారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజుతో కలిసి ఆమె శంకుస్థాపన చేసిం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఉత్తర నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. రూ.2 కోట్ల 53 లక్షలతో బీటీ రోడ్లు, ఫుట్‌పాత్‌లు నిర్మించనున్నామన్నారు. క్యాబినెట్‌లో సీఎం వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయంతో ఎంతో మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందన్నారు. దాదాపు పది వేల మంది క్రమబద్ధీకరణ జరగనుందని చెప్పారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

కె.కె.రాజు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించేలా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని కొనియాడారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, షిర్డీసాయిబాబా దేవాలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కె.వి.బి.ఎస్.ఎన్.రాజు, కిరణ్‌రాజు, కోడూరు సత్యనారాయణ, బల్ల శ్రీనివాస్, లంకా భాస్కర్, నవీన్‌రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.96 లక్షలతో రోడ్ల ఆధునికీకరణ


అబిడ్‌నగర్‌లో రహదారి పనులు ప్రారంభిస్తున్న కె.కె.రాజు, బాణాల శ్రీనివాస్

సీతంపేట: జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం అబిడ్‌నగర్ వద్ద రూ.96 లక్షలతో చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరిగింది. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, బాణాలతో కలిసి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం సమీపంలోని అబిడ్‌నగర్ పార్కును సందర్శించారు. పార్కు ఆవరణలో ఏర్పాటు చేసిన సోలార్ ల్యాంప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన రోడ్డు పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు హబీబ్, ఖాన్, కిషోర్, బాక్సర్ వెంకటరావు, బాబూరావు, హీరా, గోపి, రెడ్డి, ఆదినారాయణ, కె.నాగమణి, శ్యామల, సీతారాములు, పోలిరాజు, పద్మ, మున్ని, కమల పాల్గొన్నారు.

దశ మహావిద్యలపై ముగిసిన ప్రవచనాలు



ప్రవచిస్తున్న శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి


ప్రవచనాలు వింటున్న భక్తులు

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో ఈ నెల 4 నుంచి జరుగుతున్న దశ మహావిద్యల ప్రవచనాల కార్యక్రమం గురువారంతో ముగిసింది. కుర్తాళం శంకరాచార్య, లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి చివరి రోజు ప్రవచనంలో భాగంగా తారా దేవి వృత్తాంతం గురించి ప్రవచించారు. ఉత్తర ఈశాన్య భారత ప్రాంతాల్లో కాళీ పూజలతోపాటు తారాదేవి ఆరాధన ఉంటుందని తెలిపారు. ఎంతో సాధన చేస్తే తప్ప దేవీ సాక్షాత్కారం లభించదని, రామకృష్ణ పరమహంస వంటి వారు విశేష సాధన వల్లే కాళీ దర్శనం పొందగలిగారన్నారు. తారా మంత్రం మహిళల ద్వారా పొందడం సంప్రదాయమని పేర్కొన్నారు. తారా మంత్రోపాసన గురించి అనేక విషయాలను ఆసక్తికరంగా ఉపదేశించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, సాహితీవేత్తలు స్వామి వారి ప్రవచనాలు శ్రద్ధగా విన్నారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. శుక్రవారం నుంచి ఈ నెల 11 వరకు శక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతీ స్వామిని శ్రీ వారాహి వైభవంపై ప్రవచిస్తారని ఆయన తెలిపారు.

పిస్తోల్ కేసులో చురుగ్గా విచారణ

సీతమ్మధార : మహారాష్ట నుంచి పిస్తోల్‌ను ఒడిశాకు తరలిస్తున్న శ్రీధర్ హరికిషన్ పతాంగిని ఫోర్తుటౌన్ పోలీసులు కస్టడీకి తీసుకుని విచారించారు. అలాగే పిస్తోల్ ఇచ్చి పంపించిన మహారాష్ట్రలోని జలానా జిల్లాకు చెందిన దత్తపవర్‌ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరినీ ఒకే చోట ఉంచి గురువారం విచారణ చేపట్టారు. అసలు పిస్తోల్ ఎవరు ఇచ్చారు..?, ఎక్కడి నుంచి వచ్చింది..? అన్న కోణంలో ఆరా తీశారు. అయితే ఈ ఇద్దరూ చెప్పిన మాటలకు పొంతన లేకపోవడంతో దత్త పవర్‌ని ప్రత్యేకంగా విచారించారు. సందీప్ అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేసినట్లు దత్త పవర్ పోలీసుల విచారణలో చెప్పినట్లు తెలుస్తోంది. ఈ కేసులో రోజుకో కొత్త పేరు వెలుగులోకి రావడం పోలీసులకు తలనొప్పిగా మారింది. గతంలో ఆత్మరక్షణ కోసమని చెప్పి... ప్రస్తుతం సందీప్ నుంచి కొనుగోలు చేసినట్లు చెప్పడంతో ఆ వ్యక్తిపై పోలీసులు దృష్టి సారించారు. అసలు పిస్తోళ్లు ఎవరు సరఫరా చేస్తున్నారు అన్న కోణంలో ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.

సమాచారమ్

ఇంటర్‌లో ప్రవేశాలకు విద్యార్థినులకు ఆహ్వానం


జీవీఎస్‌ఎంసీ హైస్కూల్-జూనియర్ కళాశాల

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు పీ అండ్ టీ కాలనీలోని ఎస్‌ఎంసీ హైస్కూల్, బాలికల జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు జరుగుతున్నాయని, పరిమిత సీట్లు మాత్రమే ఉన్నాయని ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్ తెలిపారు. అత్యున్నత విద్యార్హతలు, అంకితభావం గల అధ్యాపక బృందం, వివేకంతో కూడిన విద్య అందిస్తున్నట్లు చెప్పారు. ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో చేరేందుకు బాలికలు వెంటనే అడ్మిషన్లు తీసుకోవాలని కోరారు. బైపీసీ గ్రూప్‌లో 40 సీట్లు, ఎంపీసీలో 40 సీట్లు చొప్పున ఉన్నాయని చెప్పారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫారం, మధ్యాహ్న భోజన పథకంతోపాటు ఉచితంగా ప్రభుత్వ హాస్టల్ సదుపాయం ఉందన్నారు. అమ్మ ఒడి పథకం వర్తిస్తుందని తెలిపారు. నువ్వే మా నమ్మకమని నమ్ముతున్న జగనన్న విద్యా దీవెన పథకం ఆశయాలకు అనుగుణంగా.. 'ఆడపిల్ల చదువు అవనికి వెలుగు' అని నిరూపిద్దామని హెచ్‌ఎం పిలుపునిచ్చారు.

